# మావాడు

వదలి రాధాకృష్ణ

అసలు ఏమనుకోవాలి? కొన్నిటి గురించి ఆలోచించకపోవడమే మంచిది! ఆలోచిస్తూ కలత చెందడం, మనసు పాడుచేసుకోవడం ఎంతవరకూ సమంజసం?... అందులోనూ నా లాంటి సున్నితమనస్కుడు అయితే మరీను. అందుచేతనే కష్టం కలిగిన ప్రతిసారీ ఆలోచించ కుండానే ముందుకు సాగుతున్నాను.

జీవితం నేర్పుతున్న పాఠాలలో నేను ము ఖ్యంగా గ్రహించగలిగిన అంశం అదే! అవును. అవడం అన్నగారే కానీ ఆయన్ని ఏమనుకో వాలి?... ఊహ తెలిసీ తెలియని వయసులో 'ఏరా' అని పిలిచేవాణ్ణి. క్రమంగా ఊహలు విస్తృతమైన తర్వాత ఆ దగ్గరితనం కనుమరుగై పోయింది. ఇప్పుడు 'అతను' అయిపోయాడు. రేపు ఎలా ఉంటుందో చెప్పలేను... బహూశా 'ఆయన' అనక తప్పకపోవచ్చు.

లేకపోతే ఇంతకాలానికి నేను గుర్తుకొచ్చి నట్లున్నాను. ఓ ఉత్తరం వ్రాసి పడేసాడు. అది ఇప్పుడు ఎంత కలకలాన్ని లేపుతోందో ఆలో చిస్తే తట్టుకోలేకపోతున్నాను. బుర్ర వేడెక్కి పోతోంది. ఈ ప్రపంచంలో రక్తం పంచుకు పుట్టిన ఏ వ్యక్తీ ఇంత దుర్మార్గంగా ఉండకూడ దన్నది నా ఉద్దేశ్యం.

బహుశా నాలుగు జీతంరాళ్ళు వెనకేసే సరికి నెత్తికెక్కిన తిక్క మనిషిని మారుమనిషిగా మార్చేస్తుందేమోననిపిస్తోంది. ఆ స్థితికి తోడు, నీడ, రక్తసంబంధం వంటివి ఏమీ మినహాయిం పుకావని అన్పిస్తోంది.

చెప్పాలంటే సత్యనాథాన్ని నా అన్నగారని చెప్పుకుందుకే సిగ్గుగా ఉంది. ఏం చేస్తాను?... నా దురదృష్టం అనుకోక తప్పడంలేదు.

అమ్మ నన్ను కన్న కొన్నాళ్లకే నాన్న కన్ను మూసాడు. దాంతో కుటుంబంలో పెద్ద కుదుపు వచ్చింది. పెనుతుఫాను వంటి మార్పులు చోటు చేసుకోసాగాయి. నాకు జ్ఞానం తెలిసినప్పటికే తను మంచి ఉద్యోగంలో స్థిరపడిపోయాడు. పెళ్లిచేసుకొని తను తన సంసారంతో చక్కగా కాలాన్ని వెళ్లదీస్తున్నాడు.

ఇక ఏ దిక్కూలేని అమ్మ సంగతి చూడాలి. ఆమె బాధలు వర్ణనాతీతం. ఎక్కడో పరాయి చోట ఏ బాధ్యతా పట్టని అతను, ఇక్కడ మేమిద్ద రమూ. నన్ను పెంచడానికి ఎంతగానో కష్ట పడింది. ఏడాదికోసారి చుట్టపుచూపుగా వచ్చి పోవడమేగానీ అన్నగా, కొడుకుగా ఆయనగారు ఆదుకున్నదేమీలేదు.

వచ్చి ఏవేవో పైపైపలుకులు తీయగా పలికి పోయేవాడు. ఆయనగారి వల్ల ఎప్పుడూ మంచి సలహాగాని, సహాయంగానీ పొందలేకపో యాను.

చెప్పాలంటే పెద్దాడు చాలా అదృష్టవం తుడు. తండ్రి బ్రతికున్న కాలం అన్నీ అలాగ కలిసొచ్చాయి. చదువు, ఉద్యోగం... దేనికీ పెద్దగా తడుముకోనక్కరలేకపోయింది. నాదగ్గర కొచ్చేసరికి అన్నీ తరువాయిలయి కూర్చు న్నాయి.


అమ్మ అంటున్న మాటలు నన్ను వెంటాడు తూనే ఉండేవి... నా గురించి ఎప్పుడూ ఏక రువుపెడుతూ ఉండేది. ఎవరి అదృష్టం వారిది. అంతకుమించి ఇప్పుడు అనుకుని సుఖమే ముంది?

అమ్మకి నాదగ్గరే బాగా అలవాటు. ఉన్నంతలో బాగానే చూడగలిగాను. నాకు 'మహర్షి' అన్న పేరు పెట్టింది. నన్ను ఓ మహర్షిలాగ చూసుకొనేది. కానీ అతగాడి ఉద్దేశాలు ఇప్పటికీ నాకు అర్థంకావు. తను మనిషినన్న విషయమే మర్చిపోయాడు. తన వాళ్లు అన్న సంగతే విస్మరించాడు. కనీసం ఆయన భార్యగారికయినా జ్ఞానం ఉండక్కరలేదా అంటే ఆవిడ మరీనూ... ఆమెలోకం ఆమెది.

బహుశా పెద్ద చదువులు... పెద్ద ఉద్యోగాలు... పరపతి... పెద్ద జీతాలు... హోదా... ఇవే మనిషిని ఎలివేట్ చేసిపడేసి, కొన్ని మూలాలను తుంచిపడేస్తాయేమో!

ఒకేచేతి వేళ్లు ఒకేలా ఉండవంటారే! అలా సత్యనాధం... మహర్షి... నాకూ వాడిలా చదవాలని ఉన్నా ప్రోత్సాహం లేక అంతటితో ఆగిపోయాను.

చిన్న గుమాస్తాగిరి ఉద్యోగం, కొద్దిపాటి జీతం. ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. దానికితోడు అమ్మ అనారోగ్యం... కొడుకు చదువు... సంసారం. చెప్పాలంటే మా నాన్న



సంపాదించి ఇచ్చిన చిన్నపాటి పల్లెటూరులోని పెంకుటిల్లు తప్ప ఇంకేమీ ఆస్థి లేదు నాకు.

నాకింత గుర్రు ఏమిటి అని ఎవరైనా అనుకున్నా అదివేరే విషయం. నేను ఎవరిదగ్గర నుండీ ఏమీ ఆశించడం లేదు. కానీ జీవితంలో స్థిరత్వానికి నాకు సరైన పంథాని సూచించ లేదన్న విషయం మీద మాత్రమే ఆయనతో నేను విభేదిస్తుంటాను. అంతే!

అక్కడికీ అమ్మ రెక్కలు ముక్కలు చేసుకొని నన్ను ఈ మాత్రమైనా చదివించింది. అందుకే నా కొడుకు విషయంలో పొరబాటు పునరావృతం కాకుండా జాగ్రత్తపడుతున్నాను. ఇప్పుడు వినయ్ హైదరాబాద్‌లో చిన్న ఉద్యోగం చేసుకుంటూ వాడికాళ్లమీద వాడు బ్రతుకుతున్నాడు.

మా అన్నగారు ఉద్యోగంలో రిటైరైపోయాడు. హైదరాబాద్‌లో చక్కటి ఇల్లు. కొడుకు అమెరికా ఉద్యోగం. మా అమ్మ కాలంచేసిన తర్వాత రాకపోకలు పూర్తిగా బంద్ అయిపోయాయి.

వినయ్ తన ఊర్లోనే ఉద్యోగం చేస్తున్నా, కనీసం వాడి గురించి తెలియదంటే ఇంకేమి చెప్పాలి? మనిషి సాంఘిక, ఆర్థిక స్థితిగతులు అలా అంతరాలను ప్రేరేపిస్తాయనుకుంటా!

నా భార్యమటుకు చాలా అనుకూలవతి. నా కష్టసుఖాలను సమానంగా పంచుకొని సహాయకారిగా ఉంటుంది. నేను ఆయనగారిని ఇంతగా ఈసడించుకుంటున్నా ఆమెకు మాత్రం బావగారి మీద భక్తి చెక్కుచెదరలేదు. 'ఆయన కున్న అవకాశం అంతే!' అని కొట్టిపడేసేది.

అటువంటిది ఆయన నుంచి వచ్చిన ఆ కబురుని చూసి చిర్రెత్తి పోతోంది.

'బావగారు చాలా పెద్దమనిషి అనుకున్నాను. ఒక్కగానొక్క తమ్ముణ్ణి ఇంతగా వీధిన పడేస్తాడా?' అంటూ ఈసడించుకుంటోంది. వారం రోజుల నుంచి ఆమె మంచినీళ్లు కూడా ముట్టడంలేదు.

ఆ పెద్దాయనకళ్లు ఈ చిన్న కొంపమీద పడ్డాయంటే నమ్మలేకపోతున్నాను. ఈ పల్లెటూరులో ఆయనగారేమన్నా వచ్చేదా ఉందేదా... దీంట్లో కూడా వాటా కావాలట' ఆమె కంట కన్నీరు నాలో కలవరాన్ని రేపుతోంది.

'పట్నంలో ఉండి అన్ని ఆస్తుల్ని సమకూర్చుకున్న మనిషికి ఇంకా ఆశతీరలేదన్నమాట'. తమ్ముణ్ణి వీధిలో పడెయ్యడమే ఆయన ధ్యేయంలా ఉంది!!

'..........'

'కన్నతల్లిని ఒక్క నెలరోజులైనా తీసుకెళ్లడానికి చేతులురాని మనిషికి తమ్ముడు జీవితానికి గండికొట్టడానికి చేతులు వచ్చి పడ్డాయి.'

'..........'

'నాన్నగారి ఆస్థిని పంచుకొనేందుకు ఫలానా తేదీన గూడెం వస్తున్నాను. సిద్ధంగా ఉండు'.

ఫోన్ చేయడానికి ముఖం చెల్లలేదేమో ఇలా కార్డు వ్రాసి పడేసాడు.

ఏం చెప్తాం? దుర్మార్గం మనిషిని రాక్షసుడిగా మారుస్తున్న కాలమిది. ఆలోచిస్తూంటే జీవితం మీద విరక్తి కల్గుతోంది. ఉండటానికి గూడు కూడా మిగలడం లేదన్న వాస్తవం తల్చుకుంటే వెన్నులో వణుకు ప్రారంభమవుతోంది.

రాబోయే కాలం ఎటువంటి గడ్డు స్థితుల్ని కల్గిస్తుందో చెప్పలేకుండా ఉన్నాను.

* * *

ఆయన్ని చాలా సంవత్సరాల తర్వాత చూస్తున్నాను. మనసులో నాకు చాలా గుబు

లుగా ఉంది. తను ఏవేవో మాట్లాడుతున్నాడు. మనిషిలో కూడా కొంత మార్పు అగుపిస్తోంది.

'వినయ్ ఎలా ఉన్నాడు?'

'నీలా పెద్దచదువులు చెప్పించలేకపోయినా వాడి బ్రతుకు వాడు బాగానే బ్రతికేస్తున్నాడు' అందామనుకున్నాను. కానీ మాట బయటకు రాలేదు.

'ఊరంతా తిరిగొచ్చాను. గూడెం బాగా మారిపోయింది' ఈ మధ్యనే పడిన సిమెంట్ రోడ్లను పరికిస్తూ అన్నాడు సత్యనాథం.

బావగారి స్నానానికి వేడినీళ్లు ఏర్పాటు చేసింది. కాఫీ టిఫిన్లు కూడా బాగానే సమకూర్చి పెట్టింది మా ఆవిడ.

'మా కుర్రాడు అమెరికాలో ఉన్నాడు! ఆయన మాటల్లో దర్పం తెలుస్తూనే ఉంది.

'నేను హైదరాబాద్‌లో స్థిరపడ్డాను' అంటే నువ్వు గూడెం వాసివి మాత్రమే అన్న వ్యంగ్య ధోరణి అగుపిస్తోంది నాకు.

'ఇప్పుడు ఇంటి పంపకాల గురించి మాట్లాడుకుందామని వచ్చాను' నా గుండె బొంగురు బోయి ఉంది. ఏదో తెలియని నైరాశ్యకత ఆవహించేస్తోంది నన్ను. అతన్ని నోరు తెరిచి అడగాలనిపించినా నా వ్యక్తిత్వం నన్ను కట్టిపడేస్తోంది.

నా చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. అదేదో సముదాయింపులా ఉంది. నామటుకు చాలా చిత్రంగా ఉంది అతగాడి పద్ధతి.

'అవును మహర్షీ! అమ్మ బాధ్యతను పూర్తిగా విస్మరించాను అంటే ఆమంటే ప్రేమలేక కాదు. పరిస్థితులు పూర్తిగా నాచేతుల్లో లేక!'

'..........'

'చాలా సుదూరప్రాంతాలు... ట్రాన్స్‌ఫర్ బుల్ జాబ్... కేర్‌టేకర్‌గా నువ్వు నాకన్నా ఆప దను బాగా సముదాయించగలవన్న గొప్ప నమ్మకం...'

'..........'

'బహుశా నా ఉద్దేశం నీకు, పోయిన అమ్మకూ నచ్చి ఉండకపోవచ్చు. పదిరోజులు సెలవు పెట్టి వద్దామన్నా రాలేకపోయిన ఉద్యోగ పరిస్థితులు...!

'..........'

'నీ కొడుకు హైదరాబాద్... నువ్వు గూడెం. నా కొడుకు అమెరికా... నేను హైదరాబాద్...!'

'..........'

'అవును మహర్షీ! నాన్న బ్రతికున్న కాలంలో నాకు లభించిన వెసులుబాటు ఆయన పోయిన తర్వాత నీకు లభించలేదన్నది వాస్తవం.'

'..........'

'ఊరూరా తిరగాల్సిన ఉద్యోగం. బాధ్యతల నుంచి తప్పించుకోలేని ఉద్యోగం... ఓవిధంగా కుటుంబ నేపథ్యానికి అన్యాయం చేశానని తెలుసు నాకు'


'..........'

'కుటుంబపరమైన బాధ్యతల్ని విస్మరించడం అవివేకమనిపించినా కొంత శూన్యం... కొంత కాకతాళీయం!'

'..........'

'నాకు లభించిన వెసులుబాటుకు సంబంధించిన పరపతి... హోదా... సంపాదన... వీటన్నిటినీ తులనాత్మకంగా విశ్లేషిస్తే నాదను కున్న హైదరాబాద్ ఇల్లు నీకు చెందాలనేది నా అభిప్రాయం'

'..........'




'అవును... జూబ్లీహిల్స్ ఇల్లు నీకిచ్చేసి ఈ ఇంటిని నేను పంచుకుందుకు వచ్చాను'

'..........'

'నా భార్య, నా కొడుకు నా ఈ ప్రపోజల్ కాదనరనే నమ్మకం నాకుంది!'

'..........'

'నీ కొడుకు దగ్గరగా నువ్వుండు. మావాడు అమెరికాలో... నాకు హైదరాబాద్ అయినా ఒక్కటే... గూడెం అయినా ఒక్కటే. ఫారిన్ నుంచి ఇండియా కొస్తే వాడు నాన్న దగ్గరికి గూడెం వస్తాడు. మధ్యలో మీరు ఉండనే ఉంటారు.

సడన్‌గా సత్యనాధంలో వచ్చిన మార్పు చాలా ఆశ్చర్యాన్ని కలుగజేస్తోంది నాకు.

అవును! కన్నతల్లిని, తోడబుట్టిన తమ్ముణ్ణి గాలికి వదిలేసానన్న నిజం... దాని తాలూకు నిర్లిప్తత. రేపు నా కొడుకు కూడా నా అడుగుల్లోనే అడుగేసి నడవగలడన్న భయం... కనీసం అమ్మకు ఆనాడు నువ్వున్నావు... ఇప్పుడు నేను, నా ఒంటరి నేపథ్యం..."

ఒక సుఖాంత బ్రతుకు దృశ్యం ఆవిష్కృతం కావాలన్న కోరికా?

బావగారి మాటలకు నా భార్య తబ్బిబ్బవుతోంది. మావాడు హైదరాబాద్ తన దగ్గరకు వచ్చేయమంటున్నాడు. వెళ్లి ఎలా ఉంటాం?... ఎక్కడ బతుకుతాం? అనే ప్రశ్న మమ్మల్ని ముందుకు అడుగువేయనీయలేదు'. ఆయన మాటలు ఇప్పుడు కొంత నిజాయితీని సంతరించుకుంటున్నాయి. బహుశా ముందు చూపు తాలూకు పశ్చాత్తాప ధోరణి అయి ఉండొచ్చు. మారిన పరిణామాల మధ్య ఇంతకాలం సత్యనాధాన్ని 'ఆయనగా తలచుకొనేవాణ్ణి'.

ఇప్పుడు వాడు... 'మావాడు'. ఆ దగ్గరతనం ఈ జీవిత చరమాంకంలో నాకు కొంతగానైనా ధైర్యాన్ని ప్రోదిచేయగలదన్న నమ్మకం కుదురుతోందిపుడు. ●